# ప్రేమాయణం



కోర్టులో చాలా విచిత్రమైన కేసు విచారణకివచ్చింది. మిస్ అనిత అనే వనిత నలుగురు ప్రియులకి ప్రేమ లేఖలు జోరుగా వ్రాయసాగింది. నలుగురూ ఆమెని గాఢంగా ప్రేమించారు. అడపాతడపా అనుకున్న చోట కలుసుకుంటుండేవాళ్ళు. ఎవరికివారు ఆమె తమకే సొంతమని మురిసిపోతుండేవారు. ఆమెని వివాహమాడాలని ఉవ్విళ్ళూరుతుండేవారు. ఆ నలుగురిలో ప్రతి ఒక్కడూ తాను మాత్రమే ఆమె ఏకైక ప్రియుడని భావించుకొనేవాడు. అయితే పెళ్ళి ప్రసక్తి వచ్చేసరికి మాత్రం అనిత జారుకునేది. ఆమెకి ప్రేమ ఇష్టమేకాని పెళ్ళి వంటికి సరిపడదు.

వేర్పుగా, గుట్టు రట్టుకాకుండా నలుగురితో వ్యవహారం నడుపుతూ వచ్చింది. అయితే ఒకసారి పొరపాటున ప్రేమలేఖలుతారుమారయ్యాయి. అంతటితో తీగలాగితే డొంకంతా కదిలినట్లు మొత్తం ప్రేమాయణమంతా బయటపడింది. ఆమె ప్రవర్తన వల్ల తమ పరువు పోయిందనీ, మానసిక వ్యధకి గురికావలసి వచ్చిందనీ, అందువల్ల తమకి నష్టపరిహారం కావాలనీ కోరుతూ నలుగురూ కోర్టుకెక్కారు. ఈ వింత కేసు ప్రజల్లో ఎంతో సంచలనాన్ని సృష్టించింది. కేసు వివరాలు విన్న జడ్జిగారు ఆశ్చర్యపోయారు. నలుగురి మనసులు రంజింపజేసిన ఆ ప్రేమలేఖల స్వరూపం చూడాలని ముచ్చటపడి వాటిని తెప్పించి చదివారు. అవి ఎంతో అద్భుతంగా ఉన్నాయి. "ప్రేమలేఖ అంటే ఇలా ఉండాలి. హు... మా ఆవిడా ఉంది ఎందుకూ? ఒక్కనాడైనా ఇటువంటిది ఒక్కటైనా రాసిందా?" అని మనసులోనే నిట్టూర్చుకున్నారు.

కోర్టు జనంతో కిటకిటలాడుతోంది. అభియోగం మోపబడిన అనితని కోర్టులో ప్రవేశపెట్టారు. నెత్తిమీద మేలి ముసుగు వేసుకొని తలవంచుకొని ఆమె బోనులోకి ప్రవేశించింది.

ప్రమాణం చేయడం పూర్తి అయింది. ఆమె ముఖం జడ్జిగారికి సరిగా కనిపించలేదు. అంతటి ప్రేమ పట్టుగల ఆమె ముఖారవిందం చూడాలని ఆయనలోఉత్కంఠత ప్రబలింది.

"నీ పేరేమిటి?" అనిగట్టిగా అడిగారుఆయన.

అప్రయత్నంగా ఆమె జడ్జిగారి వంక తలతిప్పి "లిల్లీ" అని చెప్పింది.

ఆమె వంక చూస్తూనే జడ్జిగారు కొయ్యబారిపోయారు. కళ్ళు తిరిగి పడిపోయారు. వెంటనే ఆయన్ని ఛాంబర్‌లోకి తీసుకుపోయారు. అపస్మారక స్థితిలో వున్న జడ్జీగారు కలవరిస్తున్నారు.

"ఎంతపని చేశావు లిల్లీ! నువ్వేనా అనితవి! సరే పో... నీ ఇష్టం వచ్చిన చోటికే పో. నేనే విడాకులు ఇచ్చేస్తాను" అంటూ...

పక్కనున్నవారు ముఖాలు చూసుకున్నారు. "హు... జడ్జీగారి భార్యేనన్న మాట ఇంతటి ప్రేమాయణాన్ని నడిపింది" అంటూ ముక్కుమీద వేలేసుకున్నారు. ○

కె.ఆర్.కె.మోహన్

# దీపావళి సిసింద్రీ....

ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు రాధని. కాని రాధకింత ముక్కోపమని తెలిస్తే అంత సాహసం చేసి ఉండేవాడు కాదు కృష్ణ.

పెళ్ళయి కాపురానికొచ్చి ఇంకా నెల కూడా పూర్తి కాలేదు. కాని గృహ యుద్ధాల షష్ఠి పూర్తి అయిపోయిందప్పుడే. ఆ హాట్ హాట్ హోంలో ఉదయమే రామరావణ యుద్ధం. అదీ తాజా యుద్ధకాండ. బోనస్ డబ్బుతో పట్టుచీర తెమ్మంది రాధ. అది దీపావళి బోనస్. పెద్ద పండక్కి కొంటాన్లే అన్నాడు కృష్ణ.

అంతే! అభం శుభం ఎరుగని నగిషీల గాజు గ్లాసు నలభై ముక్కలయింది. వంటింట్లో. పాపం ఆ



ముక్కలన్నీ ఏరి బయట పారేసి వచ్చాడు కృష్ణ.

"కాఫీకే ప్రాప్తం లేదు. ఇక లంచ్ కూడానా నిట్టూర్చాడు కృష్ణ. సాయంత్రం బతికుంటే బలుసాకు తినొచ్చు అనేవారాకాలంలో. ఇంట్లో శాంతి ఉంటే బ్యాంక్‌లో బోనస్ దాచుకున్నట్టే అనుకున్నాడు ఈ కాలం వాడైన కృష్ణ.

పట్టుచీర, మల్లెపూలతో ఇంటికొస్తూ ఎన్నెన్నో కలలు కన్నాడు. ఆ రాత్రి స్వర్గం దిగివచ్చి తన ఇంట్లో ఉండి తీరాలని ఆశించాడు.

"రాధా! ఆలోచిస్తే నీ కోరిక సమంజసమే అనిపించింది. కాబట్టి మనసు మార్చుకున్నాను. నువు మనసు పడ్డ పట్టుచీర, నేను సరదా పడ్డ మల్లెపూలు తెచ్చాను. తీసుకో!" అన్నాడు కృష్ణ.

రెంటినీ విసిరికొట్టింది రాధ. "తెచ్చేముందు నన్నడగ వద్దా? ఈ లోపల నేనూ మనసు మార్చుకున్నాను. ఆ డబ్బు అడ్వాన్స్‌గా కట్టి ఇన్‌స్టాల్‌మెంట్లో టూ-ఇన్-వన్ కొనిపిద్దామంటే ఇదా మీరు చేసిన నిర్వాకం! మీకు బుద్ధుందా?" అంటూ చిచ్చుబుడ్డిలా చెలరేగింది.

కృష్ణ తక్కువ తిన్నాడా? సిసింద్రీలా చిందులేసి వంటింట్లో మిగిలిన మరో రెండు గ్లాసులు తనూ పగల గొట్టాడు. ○

రాభా రకసుం